# సాక్షి
## జోగుళాంబ గద్వాల

శనివారం । 22 । ఫిబ్రవరి । 2025






### మార్మోగిన శివనామస్మరణ

శ్రీశైలానికి కాలినడకన వెళ్తున్న భక్తుల శివ నామస్మరణతో నల్లమల మార్మోగుతోంది.

వివరాలు 8లో ▸



### ..అమరచింత పట్టువస్త్రాలు

అమరచింత పద్మశాలీలు శ్రీశైల మల్లన్న భ్రమరాంబికకు పట్టువస్త్రాలు సిద్ధం చేస్తున్నారు.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
37.7/20.1

### వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరుగుతుంది. ఉక్కపోత ఉంటుంది.

# పాలమూరుపై పగ ఎందుకు?

**బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో ప్రాజెక్టులు ఎందుకు పూర్తిచేయలేకపోయారు**

- కృష్ణానదిలో 811 టీఎంసీలు పారుతున్నా సాగు, తాగునీరు లేదు
- ఏడాదికి 5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నాం
- పేట 'ప్రజా పాలన- ప్రగతి బాట' సభలో సీఎం రేవంత్‌రెడ్డి ధ్వజం
- రూ.వెయ్యి కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు



బహిరంగ సభకు హాజరైన మహిళలు



అభివాదం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

నారాయణపేట: 'పాలమూరు జిల్లాలో కృష్ణానది 811 టీఎంసీల నీరు పారుతుంది.. ఈ నీరు దశాబ్దాలుగా పారుతున్న ఈ ప్రాంత ప్రజల కష్టాలు ఎందుకు తీరలేదు.. సాగునీరు, తాగునీరు ఎందుకు అందలేదు.. బీఆర్‌ఎస్ పదేళ్ల హయాంలో పాలమూరులో ప్రాజెక్టులు ఎందుకు పూర్తి చేయలేదు.. జిల్లాను ఎందుకు నిర్లక్ష్యం చేశారంటూ' ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. శుక్రవారం నారాయణపేట జిల్లా పర్యటన సందర్భంగా దాదాపు రూ.వెయ్యి కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన సీఎం అప్పక్‌పల్లిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. పాలమూరు- రంగారెడ్డి, భీమా, నెట్టెంపాడు, తుమ్మిళ్ల, ఆర్డీఎస్, కల్వకుర్తి, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులను పూర్తి చేయకుండా పదేళ్లు నిర్లక్ష్యం చేశారు.. పైగా పోతిరెడ్డిపాడు, ముచ్చుమర్రి ప్రాజెక్టుల ద్వారా రాయలసీమకు నీళ్లు తరలించుకుపోయేందుకు అవకాశం కల్పించారని పరోక్షంగా మాజీ సీఎం కేసీఆర్‌ను ఉద్దేశించి విమర్శించారు. పాలమూరులో చేపడుతున్న ప్రాజెక్టులను అడ్డుకోవడంలో కేసీఆర్‌కు పగ ఎందుకు అని ప్రశ్నించారు. కేవలం 12 నెలల్లో రాష్ట్రంలో అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని, ఈ విషయంలో ప్రతిపక్షాలతో చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు.

### 70 ఏళ్లకు సీఎం పదవి

హైదరాబాద్ రాష్ట్రానికి పాలమూరు జిల్లావాసి బూర్గుల రామకృష్ణారావు తొలి ముఖ్యమంత్రిగా పనిచేస్తే దాదాపు 7 దశాబ్దాల తర్వాత తిరిగి పాలమూరు బిడ్డకు ముఖ్యమంత్రి అయ్యే అవకాశం వచ్చిందని రేవంత్‌రెడ్డి అన్నారు. పాలమూరు బిడ్డ మీ ముందు నిటారుగా నిలబడ్డాడు. ఉమ్మడి రాష్ట్రంలో ఎందరో ముఖ్యమంత్రులు అయ్యారు. పాలమూరు ప్రజల పేదరికాన్ని ప్రపంచ దేశాలకు చూపించి విదేశాల్లో మార్కెటింగ్ చేసుకున్నారని ఎద్దేవా చేశారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వెనకబడిన ఈ పాలమూరు జిల్లాను అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకుందామని, ఇందుకు అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డీజీపీ జితేందర్, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, కలెక్టర్ సిక్తాపట్నాయక్, ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలు పర్ణికారెడ్డి, యెన్నం శ్రీనివాసరెడ్డి, వాకిటి శ్రీహరి, జి.మధుసూదన్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి, వంశీకృష్ణ, వీర్లపల్లి శంకర్, కసిరెడ్డి నారాయణరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, డీసీసీ మాజీ అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### పేట–కొడంగల్‌ను పూర్తి చేసుకుందాం

పదేళ్లలో సంగం'బండ' పగలకొట్టలేదు. దీంతో ఆ ప్రాంతంలోని 10 వేల వ్యవసాయ భూములకు సాగునీరు అందక ఎడారిగా మారాయని సీఎం అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.15 కోట్లు మంజూరు చేసి బండను పగలకొట్టించామన్నారు. ఇప్పుడు 10 వేల ఎకరాలు పారుతున్నాయన్నారు. మక్తల్, కొడంగల్, నారాయణపేట ప్రాజెక్టు 2014లో కొట్లాడి మంజూరు చేయిస్తే తనపైన ఉన్న కోపంతో ప్రాజెక్టు నిర్మాణం చేపట్టకుండా కేసీఆర్ ఆపేశారన్నారు. ఇప్పుడు తన హయాంలో ఈ ప్రాజెక్టు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఉదండాపూర్, పాలమూరు రంగారెడ్డి, ప్రాజెక్టులను పూర్తి చేసి సాగు, తాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. పేట- కొడంగల్ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు రైతులు సహకరించాలని, రైతులకు ఎకరాకు రూ.10 లక్షలు సరిపోకపోతే రూ.20 లక్షలు ఇప్పించేందుకు కృషి చేస్తామన్నారు. లగచర్లలో పరిశ్రమల ఏర్పాటుకు కృషిచేస్తే అడ్డుకున్నారని, పాలమూరు జిల్లాను అభివృద్ధి చేసుకుంటే ఎందుకు అక్కసు వెళ్లగక్కుతున్నారని ప్రశ్నించారు. జిల్లాను అన్నివిధాలుగా అభివృద్ధి చేసే బాధ్యత నాదని, నన్ను కాపాడుకునే బాధ్యత ప్రజలపై ఉందన్నారు.

**దేశంలోనే తొలి మహిళా పెట్రోల్ బంక్**

ఆడబిడ్డలకు ఆర్థిక స్వావలంబన ఇవ్వాలని, దేశంలో ఎక్కడా లేని విధంగా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో పెట్రోల్‌బంక్ మంజూరు చేశామని సీఎం అన్నారు. ఆనాడు కాంగ్రెస్ హయాంలో 25 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తే ఆతర్వాత వచ్చిన ప్రభుత్వం పదేళ్లలో బడుగు బలహీన వర్గాల ప్రజలను డబుల్ బెడ్‌రూం ఇళ్ల పేరిట మోసం చేసి గద్దెనెక్కిందని విమర్శించారు. తిరిగి ఇప్పుడు ప్రభుత్వం ఏర్పాటు చేశాక ప్రతి నియోజకవర్గానికి 3,500 చొప్పున రాష్ట్రంలో 5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసుకొని.. ఈ రోజు నారాయణపేట మండలం అప్పక్‌పల్లి నుంచి భూమిపూజ చేయడం జరిగిందన్నారు. అవసరమైతే నియోజకవర్గానికి 5 వేలకు పెంచుతామని పేర్కొన్నారు.

> మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ ఆగస్టు 1, 2024న సుప్రీంకోర్టు ఇచ్చిన సూచన మేరకు 120 రోజుల్లో విజయవంతంగా కులగణన పూర్తి చేయడం జరిగిందన్నారు. దీంతోపాటు వర్గీకరణ పూర్తి చేసి అన్ని విధాలుగా వెనకబడిన మాదిగ కులానికి 9.7 శాతం రిజర్వేషన్ ఇవ్వబోతున్నట్లు తెలిపారు.

> రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు మాత్రమే అవుతుందని ఈలోగానే ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కృషిచేశామన్నారు. పదేళ్ల పరిపాలన చేసిన గత ప్రభుత్వం రూ.8 లక్షల కోట్లు అప్పు చేసి మరో రూ.40 వేల కోట్ల పెండింగ్ బిల్లులు పెట్టిందని దుయ్యబట్టారు. అభివృద్ధి విషయంలో వేదిక ఎక్కడైనా చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు.



మెడికల్ కళాశాల ప్రారంభోత్సవంలో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు దామోదర రాజనర్సింహ, సీతక్క, ఎంపీ డీకే అరుణ, సీఎస్ శాంతికుమారి, కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలు చిట్టెం పర్ణికారెడ్డి, వాకిటి శ్రీహరి, జి.మధుసూదన్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్ తదితరులు

## న్యూస్‌రీల్

### చదువుతోపాటు ఆరోగ్యం ముఖ్యం



గట్టు: విద్యార్థులు చదువుతోపాటు ఆరోగ్యంపై దృష్టి సారించాలని, ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు ఇక నుంచి రాగి చిక్కిని కలెక్టర్ ఆదేశాల మేరకు అందిస్తున్నట్లు డీఈఓ అబ్దుల్ గని తెలిపారు. ఇన్‌స్పైర్, అన్నపూర్ణ స్వచ్ఛంద సంస్థల సహకారంతో శుక్రవారం గట్టు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రాగి చిక్కి పంపిణీ కార్యక్రమాన్ని డీఈఓ, ఎంఈఓ నల్లారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి 6వ తరగతి నుంచి 10వ తరగతి చదువుకుంటున్న విద్యార్థులకు ఈ రాగి చిక్కిని అందించనున్నట్లు డీఈఓ తెలిపారు. 10వ తరగతి వార్షిక పరీక్షల్లో 100 శాతం ఫలితాలను తీసుకువచ్చేలా ఉపాధ్యాయులు ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలని, విద్యార్థులు కూడా క్రమం తప్పక పాఠశాలకు హాజరు కావాలని సూచించారు. మరో నెలరోజుల్లో వార్షిక పరీక్షలున్నాయని, నెల రోజులు ప్రత్యేక తరగతుల ద్వారా విద్యార్థులను సిద్ధం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌స్పైర్ కోఆర్డినేటర్ ఇనాయిస్, అన్నపూర్ణ కోఆర్డినేటర్‌సందీప్, ఎంపీడీఓ చెన్నయ్య, అమ్మ ఆదర్శపాఠశాలల కమిటీ చైర్మన్ సత్యకళ, తప్పెట్లమొర్సు హెడ్మాస్టర్ ఆగస్టిన్ తదితరులు పాల్గొన్నారు.

### వేరుశనగ క్వింటా రూ.7,019

గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్‌యార్డుకు శుక్రవారం 366 క్వింటాళ్ల వేరుశనగ రాగా, గరిష్టం రూ.7019, కనిష్టం రూ.3500, సరాసరి రూ.5729 ధరలు పలికాయి. అలాగే, 125 క్వింటాళ్ల కంది రాగా గరిష్టం రూ.7089, కనిష్టం రూ. 2689, సరాసరి రూ.5689 ధరలు వచ్చాయి.

### మంత్రుల పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు



కొత్తకోట రూరల్: రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు శనివారం జిల్లాకు రానున్నారని.. పర్యటనను విజయవంతం చేసేందుకు ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. మండలంలోని సంకిరెడ్డిపల్లి శివారులో ఆయిల్‌పాం ఫ్యాక్టరీకి మంత్రులు భూమిపూజ చేయనున్నందున శుక్రవారం ఏర్పాట్లను ఆయన పర్యవేక్షించి మాట్లాడారు. కార్యక్రమ స్థలంలో జిల్లా ఉద్యాన, వ్యవసాయశాఖకు సంబంధించిన స్టాల్స్ ఏర్పాటు చేయాలని, ఆయిల్‌పాం సాగుచేస్తున్న ముగ్గురు ఆదర్శ రైతులను కూడా కార్యక్రమానికి ఆహ్వానించాలని సూచించారు. వచ్చిన వారికి ఆహారం అందించడంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని, పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసుశాఖ అధికారులను ఆదేశించారు. కార్యక్రమానికి వచ్చే ఏ ఒక్కరికి ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ సుబ్రమణ్యం, డీఎస్పీ వెంకటేశ్వర్లు, జిల్లా ఉద్యాన అధికారి అక్బర్, జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్‌నాయక్, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**సభాస్థలిని పరిశీలించిన ఎస్పీ..**

మండలంలోని సంకిరెడ్డిపల్లి శివారులో ఆయిల్‌ఫాం ఫ్యాక్టరీ శంకుస్థాపనకు శనివారం రాష్ట్ర మంత్రులు రానున్న సందర్భంగా శుక్రవారం భద్రతా ఏర్పాట్లను ఎస్పీ రావుల గిరిధర్ పర్యవేక్షించారు. సభాస్థలి, వాహనాల పార్కింగ్ స్థలాలు, బందోబస్తు ఏర్పాట్ల తీరును పరిశీలించారు. బందోబస్తులో పాల్గొనే పోలీసు అధికారులకు క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన భద్రతపై పలు సూచనలు చేశారు. కార్యక్రమానికి వచ్చే ప్రజాప్రతినిధులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రొటోకాల్ నిబంధనలు పాటించాలని, విధులను నిర్లక్ష్యం చేయకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఎస్పీ వెంట డీఎస్పీ వెంకటేశ్వరరావు, స్పెషల్ బ్రాంచ్ సీఐ నరేశ్, కొత్తకోట ఎస్‌ఐ ఆనంద్ తదితరులు ఉన్నారు.

### చేనేత వృత్తి నైపుణ్యం పెంపొందించుకోవాలి



చీరలు నేయడం, రంగులు అద్ది కార్మికులకు చూపిస్తున్న సిల్క్ బోర్డు సభ్యులు

రాజోళి: చేనేత వృత్తి నైపుణ్యం పెంపొందించుకోవడంతోపాటు చేనేత కార్మికులు కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సెంట్రల్ సిల్క్ బోర్డు ధర్మవరం సభ్యులు అవగాహన కల్పించారు. శుక్రవారం మండల కేంద్రం రాజోళిలోని చేనేత కార్మికులకు పలు అంశాలపై అవగాహన, శిక్షణ అందించారు. రంగులు అద్దకం, వాటిని వినియోగించే తీరు, రంగులు అద్దక ముందు, అద్దిన తర్వాత ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశాలపై కార్మికులకు స్పష్టత ఇచ్చారు. చేనేత కార్మికుల ఎదుట చేసిన ప్రత్యక్ష పరీక్షలు కార్మికులు ఆసక్తిగా తిలకించారు. చీర నాణ్యతను, మన్నికను నిర్ణయించే రంగుల విషయంలో ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. 75 శాతం రాయితీతో మగ్గం సామగ్రి, కలర్ ఫ్యాక్టరీ యూనిట్లు అందిస్తారని, చేనేత కార్మికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, అర్హులైన కార్మికులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పలు రకాల చీరలు తయారు చేసే వారు ప్రత్యేకంగా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని శాస్త్రవేత్తలు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ దీపక్ సూచించారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్లు అశోక్ దేశాయ్, లోకేష్ పాల్గొన్నారు.

### తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలి

గట్టు: తల్లిదండ్రుల ఆశలు, ఆశయాలను పిల్లలు తప్పక నెరవేర్చాలని ఇంటర్‌మీడియట్ విద్యార్థులను ఉద్దేశించి జిల్లా ఇంటర్‌మీడియట్ విద్యాధికారి హృదయరాజు కోరారు. శుక్రవారం గట్టు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చక్కగా చదువుకుని వార్షిక పరీక్షలు మంచిగా రాయాలన్నారు. విద్యార్థుల జీవితంలో ఇంటర్ మీడియట్ కీలకమన్నారు. ఉన్నత శిఖరాలకు చేరుకోవడం ద్వారా చదువుకున్న కళాశాలకు, పుట్టి పెరిగిన ఊరికి, కన్న తల్లిదండ్రులకు మంచి పేరును తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ప్రభుత్వ బాలికల కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణ, ప్రభుత్వ జూనియర్ కళాశాల కో ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ వీరన్న, అధ్యాపకులు కేవీఎస్‌డీ రాజు, రాజగోపాల్, రాఘవేంద్ర, రంగస్వామి విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇంటర్ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి



విద్యుత్ సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేసి అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బీఎం సంతోష్

- అన్ని పరీక్షా కేంద్రాలలో సీసీ కెమెరాలు తప్పనిసరి
- కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల: ఇంటర్మీడియట్ పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడీవోసీ కార్యాలయంలో కాన్ఫరెన్స్ హాలులో అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 5వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఇంటర్ వార్షిక పరీక్షల నిర్వహణకు కావాల్సిన అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని పరీక్షా కేంద్రాల్లో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో 8341 విద్యార్థులు పరీక్ష రాసేందుకు 14పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో ముందస్తుగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా 144సెక్షన్ అమలు చేయనున్నందున అన్ని జిరాక్స్ సెంటర్లు మూసివేసేలా ఆదేశించారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు సెల్‌ఫోన్లు, వాచ్‌లు, ఎలాంటి ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ తీసుకురావటానికి అనుమతి లేదన్నారు. విద్యార్థులకు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. అన్ని పరీక్షా కేంద్రాలలో వైద్యశిబిరం, నిరంతరం విద్యుత్ సరఫరా, తాగునీటి సౌకర్యం, ఇతర మౌళిక సదుపాయాలు కల్పించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగ్‌రావు, ఆర్డీవో శ్రీనివాస్‌రావు, డీఎస్పీ మొగులయ్య, ఇంటర్మీడియట్ జిల్లా అధికారి హృదయరాజు, డీఎంహెచ్‌వో డాక్టర్ సిద్ధప్ప, ఆర్టీసీ అధికారి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**బడి మానేసిన విద్యార్థులను తిరిగి చేర్పించాలి**

పదో తరగతి మధ్యలో బడి మానేసిన విద్యార్థులను గుర్తించి తిరిగి పాఠశాలలో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. శుక్రవారం ఐడీవోసీ కార్యాయంలో అధికారులతో సమీక్షించారు. ప్రభుత్వం బాలకార్మికుల పరిరక్షణకు అన్ని రకాల చర్యలు తీసుకుని సమర్థవంతంగా పనిచేయాలన్నారు. ఆపరేషన్ స్మైల్‌ను మరింత పకడ్బందీగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. 18సంవత్సరాల లోపు పిల్లలను పనిలో పెట్టుకుని వెట్టిచేయించుకుంటే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగ్‌రావు, డీఎస్పీ మొగులయ్య, డీఎంహెచ్‌వో డాక్టర్ సిద్ధప్ప, ఆర్డీవో శ్రీనివాస్‌రావు వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

**వేసవిలో విద్యుత్ సమస్యలు రానివ్వొద్దు**

రబీ సీజన్‌లో సాగుచేసిన వివిధ రకాల పంటలకు, రానున్న వేసవిలో విద్యుత్తు అంతరాయం తలెత్తకుండా నిరంతరం విద్యుత్తు సరఫరా కొనసాగించేలా అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు. శుక్రవారం జూరాల జనరేషన్ ప్లాంట్, 220/132 కేవీ జూరాల సబ్‌స్టేషన్, 132/33 కేవి, 33/11 కేవీ గద్వాల సబ్‌స్టేషన్, మానిటరింగ్ సెల్‌లను అకస్మికంగా తనఖీ చేసి అక్కడి పరిస్థితులను సమీక్షించారు. ఈసందర్భంగా విద్యుత్తు సరఫరా, నిర్వహణ, డిమాండ్ అంశాలపై అధికారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో వ్యవసాయం, గృహాలు, ఆసుపత్రులు, పరిశ్రమలకు డిమాండ్ మేర నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేయాలన్నారు. ఇందుకోసం ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఎస్‌ఈ తిరుపతిరావు, ఏడీ రమేష్ బాబు, గోవింద తదితరులు పాల్గొన్నారు.

# బ్యాంకు పనిదినాలు ఐదు రోజులుగా మార్చాలి



నిరసన వ్యక్తం చేస్తున్న బ్యాంక్ ఉద్యోగులు

గద్వాల న్యూటౌన్: వారంలో బ్యాంకు పనిదినాలు ఐదు రోజులుగా మార్చాలని యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, కిష్టారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం సాయంత్రం స్థానిక యూనియన్ బ్యాంక్ మెయిన్‌బ్రాంచ్ వద్ద యూనియన్ బ్యాంక్, ఎస్‌బీఐ, కెనరా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర ఇండియన్ బ్యాంక్‌లకు చెందిన బ్యాంక్ ఉద్యోగులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు. బ్యాంకులకు ప్రతి వారంలో శని, ఆదివారాలను సెలవు దినాలుగా ప్రకటించి, ఐదు రోజులు మాత్రమే పనిదినాలుగా చేయాలన్నారు. ఈ డిమాండ్‌ను ఏడాది క్రితమే ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చినా, ఇంతవరకు స్పందించడం లేదన్నారు. ఐదు రోజులు పనిదినాలుగా నిర్ణయించాలని డిమాండ్ చేస్తూ మార్చి 24, 25వ తేదీల్లో జాతీయ స్థాయి సమ్మెను నిర్వహించనున్నట్లు తెలిపారు. బ్యాంకులలో వివిధ విభాగాల్లో ఖాళీ అవుతున్న ఉద్యోగాలను భర్తీ చేయడం లేదని, వెంటనే నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. తాత్కాలికంగా పనిచేస్తున్న ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలన్నారు. ఈకార్యక్రమంలో యూనియన్ నాయకులు రవికుమార్, ప్రభాకర్‌రెడ్డి, గిరీష్, సందీప్‌దినకరన్‌తో పాటు, వివిధ బ్యాంకుల ఉద్యోగులు పాల్గొన్నారు.

# హోరాహోరీగా పొట్టేళ్ల బల ప్రదర్శన పోటీలు



అంతర్రాష్ట్ర స్థాయి బలప్రదర్శన పోటీల్లో తలపడుతున్న పొట్టేళ్లు

అయిజ: మండల కేంద్రంలోని తిక్కవీరేశ్వర స్వామి జాతర సందర్భంగా నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ కమిటీ వారు శుక్రవారం అంతర్రాష్ట్ర స్థాయి పొట్టేళ్ల బల ప్రదర్శన పోటీలు నిర్వహించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన 20 పొట్టేళ్లు హోరా హోరీగా తలపడ్డాయి. అయిజ మండలానికి చెందిన సుల్తాన్ పొట్టేలు ప్రథమ స్థానంలో నిలిచి రూ.50వేలు, హైదరాబాద్‌కు చెందిన రాజావలి, ఎంజీ గ్రూప్, క్రైమ్ మేకర్ పొట్టేళ్లు ద్వితీయ, తృతీయ, నాల్గో స్థానాల్లో నిలిచి రూ.35వేలు, 20వేలు, రూ.10వేలు గెలుచుకున్నాయి. అనంతరం విజేతలకు నిర్వాహకులు నగదు బహుమతులను అందజేశారు.

# జాతీయస్థాయికి ముష్టిపల్లి విద్యార్థుల ప్రాజెక్టు

పెద్దకొత్తపల్లి: డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ లిటరసి వారు ఆన్‌లైన్‌లో నిర్వహించిన స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్‌లో పెద్దకొత్తపల్లి మండలం ముష్టిపల్లి పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభకనబరిచారు. విపత్తుల నిర్వహణ అంశంపై విద్యార్థులు గాధరి ప్రవీణ్, సాయిచరణ్ రూపొందించిన నోకాస్ట్ లైఫ్ సేవింగ్ బోటు అనే ప్రాజెక్టు జాతీయస్థాయికి ఎంపికైందని హెచ్‌ఎం సురేఖ తెలిపారు. వరద బాధితుల ప్రాణాలను రక్షించేందుకు ఉపయోగపడే ఈ ప్రాజెక్టు అభివృద్ధి కోసం గురుకాసి యూనివర్సిటీ వారు అవసరమైన నిధులను అందజేస్తున్నట్లు ప్రకటించారు. జాతీయస్థాయికి ఎంపికైన విద్యార్థులతో పాటు గైడ్ టీచర్ శైలజ, విద్యార్థుల తల్లిదండ్రులకు డీఈఓ రమేష్ కుమార్ అభినందనలు తెలిపారు.



ముష్టిపల్లి విద్యార్థులు తయారుచేసిన నీటి పడవ

## క్లుప్తంగా

### రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి


అబ్దుల్ ఆది (ఫైల్)

**ఊట్కూరు:** ప్రమాదవశాత్తు ఓ బాలుడు మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. ఊట్కూరుకు చెందిన కల్వాల్ ఖయ్యూం తన కుటుంబ సభ్యులతో కలిసి కారులో కర్ణాటకలోని గుల్బర్గకు వెళ్లారు. అక్కడి నుంచి స్వగ్రామానికి వస్తుండగా.. మండల కేంద్రంలో రోడ్డుపై అడ్డుగా గుర్రాలు రావడంతో సడన్‌బ్రేక్ వేశారు. దీంతో కారు ముందుభాగంలో కూర్చున్న కల్వాల్ ఖయ్యూ కుమారుడు అబ్దుల్ ఆది (7) డ్యాష్‌బోర్డుకు బలంగా తలగడంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆ బాలుడు గ్రామంలోని ప్రైవేటు పాఠశాలలో 2వ తరగతి చదువుతున్నాడు. బాలుడి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

### కేఎల్ఐ కాల్వలో పడి యువకుడు..

**ఉప్పునుంతల:** మండలంలోని తాడూరు–చెన్నారం మార్గమధ్యంలో కొత్తగా తవ్వుతున్న కేఎల్ఐ కాల్వలో పడి కల్వకుర్తి మండలం రఘుపతిపేటకు చెందిన సంబు వినోద్‌గౌడ్ (26) మృతిచెందినట్లు ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. వినోద్‌గౌడ్ గురువారం స్వగ్రామం నుంచి తాడూరులోని బంధువుల ఇంటికి బైక్‌పై బయలుదేరాడు. రాత్రి తాడూరు నుంచి చెన్నారం వైపు వెళ్తుండగా.. మార్గమధ్యంలో రోడ్డుపై తవ్విన కేఎల్ఐ కాల్వలో బైక్‌తో సహా పడిపోయాడు. ఈ ప్రమాదంలో తలకు తీవ్రం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. తండ్రి సుల్తాన్‌గౌడ్ ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

### కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య


శివలీల (ఫైల్)

**తెలకపల్లి:** కుటుంబ కలహాలతో వివాహిత ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తెలకపల్లి మండలం ఆలేరు గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ నరేష్ వివరాల మేరకు.. ఆలేరుకు చెందిన భాషమోని యాదగిరికి నాలుగేళ్ల క్రితం పెద్ద ముద్దునూరుకు చెందిన శివలీల (24)ను ఇచ్చి వివాహం జరిపించారు. వారికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. శివలీల భర్త యాదగిరి మరో మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. దీంతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో తీవ్ర మనస్థాపానికి గురైన శివలీల.. గురువారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తండ్రి పిట్టల యాదగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### ఇసుక ట్రాక్టర్లు సీజ్

**లింగాల:** మండలంలోని అంబట్‌పల్లి సమీపంలో గురువారం రాత్రి రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ నాగరాజు శుక్రవారం తెలిపారు. అంబట్‌పల్లి నుంచి ఇతర ప్రాంతాలకు అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసి పట్టుకున్నామని.. ఇసుక తరలిస్తున్న గోవిందు, రాముపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

### కేసు నమోదు

**లింగాల:** మండలంలోని అవుసలికుంట సమీపంలో నిలిపిన గొర్రెల మంద నుంచి గురువారం ఒక గొర్రెను దొంగిలించి ద్విచక్ర వాహనంపై తరలిస్తుండగా గస్తీ తిరుగుతున్న పోలీసులు పట్టుకున్నారని ఎస్ఐ నాగరాజు తెలిపారు. గొర్రెను తరలిస్తున్న రమేశ్, మహేశ్‌పై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

### పశువుల కంటైనర్ పట్టివేత

**జడ్చర్ల:** కంటైనర్‌లో గుట్టుగా తరలిస్తున్న 36 పశువులను మండలంలోని గొల్లపల్లి శివారులో శుక్రవారం పట్టుకున్నట్లు సీఐ కమలాకర్ తెలిపారు. పశువులను అనంతపూర్‌కు తరలిస్తున్నారని.. డ్రైవర్ రాంషీద్ పున్నోలిని అదుపులోకి తీసుకొని కేసునమోదు చేసినట్లు వివరించారు. స్వాధీనం చేసుకున్న పశువులను హన్వాడ మండలం చిన్నదర్పల్లి శివారులో ఉన్న గోశాలకు తరలించినట్లు సీఐ తెలిపారు.

### షాబాద్‌లో కిరాణ దుకాణం దగ్ధం

**ఇటిక్యాల:** విద్యుదాఘాతంతో కిరాణ దుకాణం దగ్ధమైన ఘటన శుక్రవారం మండలంలోని షాబాద్‌లో చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకటేష్, స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన రాధమ్మ కిరాణం దుకాణం నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకునేది. శుక్రవారం అర్ధరాత్రి సమయంలో షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో దుకాణంలో ఉన్న సుమారు రూ.70 వేల సామగ్రి కాలి బూడిదయ్యాయని బాధితురాలు తెలిపారు. ప్రభుత్వం స్పందించి ఆర్థికంగా ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు. ఘటన స్థలాన్ని ఎస్ఐ పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

# చిట్టెం నర్సిరెడ్డి పేరు పెట్టండి


మెడికల్ కళాశాలలో విద్యార్థులతో కరచాలనం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

- ఉన్నతాధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచన
- మెడికల్ కళాశాల విద్యార్థులతో సీఎం ముఖాముఖి

**నారాయణపేట:** నారాయణపేట నూతన ప్రభుత్వ మెడికల్ కళాశాలకు దివంగత చిట్టెం నర్సిరెడ్డి పేరు పెట్టేందుకు పరిశీలించాలని ఉన్నతాధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. శుక్రవారం నారాయణపేట జిల్లాలో మెడికల్, నర్సింగ్, పారా మెడికల్ కళాశాలలను ప్రారంభించిన అనంతరం విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేరళ, రాజస్తాన్‌తోపాటు రాష్ట్రంలోని ఇతర జిల్లాల నుంచి వచ్చిన విద్యార్థులు ఇక్కడ చదువుకుంటున్నారన్నారు. మారుమూల ప్రాంతంలో మెడికల్ కళాశాలను ప్రారంభించుకోవడాన్ని బట్టి చూస్తే ప్రభుత్వం ఎంత చిత్తశుద్ధితో ముందుకు వెళ్తుందో తెలుస్తోందన్నారు. మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా గతంలో తిరస్కరించారని, కానీ ప్రభుత్వం వాటిని తిరిగి తీసుకువచ్చేందుకు ఎంతో కృషి చేసిందన్నారు. తండాల్లో, గూడాల్లో, గ్రామాల్లో మెరుగైన వైద్యం అందించాలని ముందుకు సాగుతుందన్నారు. టీచింగ్, నాన్‌టీచింగ్ లేకుండా గొప్ప డాక్టర్లు కావడం అనేది కష్టమని, మేము ఎంత చేసినా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చెప్పినట్లు రంగుల గోడలు, అద్దాల మేడలు అభివృద్ధి కాదు.. నిజమైన పేదవారికి సంక్షేమ ఫలాలు అందించాలని, చదువుకున్నప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అంతకుముందు విద్యార్థులు మాట్లాడారు. అంతకు ముందు ఉమ్మడి జిల్లా పరిధిలోని పోలేపల్లి ఎల్లమ్మదేవిని ముఖ్యమంత్రి, మంత్రులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.


మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్‌బంక్‌ను ప్రారంభించిన సీఎం.. బైక్‌లో పెట్రోల్ పోస్తున్న మంత్రి సీతక్క

**నిధులు మేమిస్తాం.. నిర్వహణ మీరు చేపట్టండి**

నిధులు మేమిస్తాం.. నిర్వహణ మీరు చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి మహిళలకు భరోసానిచ్చారు. పెట్రోల్‌బంకును ప్రారంభించిన అనంతరం మహిళా సంఘాల సభ్యులతో సీఎం ముఖాముఖి కార్యక్రమంలో మాట్లాడారు. మహిళలు ఆర్థికంగా ఎదగాలని, కోటి మందిని కోటీశ్వరులను చేసే బాధ్యత ప్రభుత్వం తీసుకుందన్నారు. 600 బస్సులను మహిళా సంఘాల ద్వారా అద్దెకు ఇవ్వడం జరిగిందని, సోలార్ ప్లాంట్లు పెట్టిస్తున్నామన్నారు. కోటి మంది మహిళలతో హైదరాబాద్ రింగ్ రోడ్డులో ప్రదర్శన నిర్వహించబోతున్నామన్నారు.

### సీఎం పర్యటన సాగిందిలా..

**నారాయణపేట:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన నారాయణపేట జిల్లాలో 3 గంటల 15 నిమిషాల పాటు సాగింది. పర్యటనలో భాగంగా దాదాపు రూ.వెయ్యి కోట్ల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో దాదాపు 40 నిమిషాల పాటు ప్రసంగించారు.

- మధ్యాహ్నం 2.05 గంటలకు హెలికాప్టర్ ద్వారా పోలేపల్లి నుంచి నారాయణపేట మండలం సింగారం గేటు సమీపంలో ఏర్పాటుచేసిన హెలీప్యాడ్‌కు సీఎం చేరుకున్నారు.
- 2.09 గంటలకు జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన పెట్రోల్ బంక్‌ను ప్రారంభించారు. మహిళా గ్రూపు సభ్యులతో మాట్లాడారు.
- 2.38 గంటల అక్కడి నుంచి బయలుదేరి 2.48 గంటలకు అప్పక్‌పల్లి దగ్గర ఏర్పాటు చేసిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేశారు.
- 3 గంటలకు మెడికల్ కళాశాల వద్దకు చేరుకొని కళాశాలను ప్రారంభించారు. 3.35 గంటల వరకు మెడికల్ కళాశాలలో విద్యార్థులతో మాట్లాడారు.
- 3.40 గంటలకు బహిరంగ సభ వేదికకు చేరుకున్నారు. మంత్రులు పొంగులేటి, దామోదర రాజనర్సింహ, సీతక్క, జూపల్లి కృష్ణారావు, స్థానిక ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డితో కలిసి జ్యోతిప్రజ్వలన చేసి సభను ప్రారంభించారు.
- 4.18 గంటల వరకు దాదాపు 40 నిమిషాల పాటు సీఎం ప్రజలనుద్దేశించి ప్రసంగించారు.
- సాయంత్రం 5.20 గంటలకు హైదరాబాద్‌కు తిరిగి బయలు దేరారు.

### సీటు వస్తుందో.. రాదో అనుకున్నా



మాది రైతు కుటుంబం. ఎంతో కష్టపడి మా తల్లిదండ్రులు చదివించారు. నాకు ఎంబీబీఎస్ సీటు వస్తుందో రాదో అనుకున్నా. రాష్ట్రంలో 8 కొత్త కళాశాలు రావడంతో నాకు సీటు వచ్చింది. తక్కువ సమయంలో మారుమూల ప్రాంతంలో మెడికల్ కళాశాలను ఏర్పాటు చేసి ల్యాబ్స్, ఫ్యాకల్టీ ఇతర సదుపాయలను కల్పించారు. ఈ కళాశాలను తీసుకురావడానికి కృషి చేసిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు.

– శ్రీధర్, దేవరకొండ గ్రామం, నల్లగొండ జిల్లా

### ప్రభుత్వానికి కృతజ్ఞతలు



రాష్ట్ర వ్యాప్తంగా కొత్తగా 16 నర్సింగ్ కళాశాలలను ఏర్పాటు చేయడంలో ప్రత్యేకంగా ప్రభుత్వానికి, సీఎంకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. ఈ కళాశాలలో నర్సింగ్ కోర్సు చేస్తున్నాను. ఈ కోర్సు పూర్తి చేసి నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తా.

– నవనీత, నర్సింగ్ విద్యార్థిని, వికారాబాద్

### అదృష్టంగా భావిస్తున్నాం



నేను పారా మెడికల్ కళాశాలలో ఈసీజీ గ్రూప్‌లో జాయిన్ అయ్యాను. మా జిల్లాలో నూతనంగా ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రారంభించడంతో ఇక్కడి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వీలైనట్లయ్యింది. ఇంతకుముందు ఈసీజీ లేకపోవడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లి చూయించుకునే వారు. ప్రభుత్వం మారుమూల ప్రాంతమైన ఈ నారాయణపేటలో మెడికల్ కళాశాల ఏర్పాటు చేయడం అదృష్టంగా భావిస్తున్నాం.

– సాయిమాధురి, ఈసీజీ స్టూడెంట్, పారామెడికల్ కళాశాల, నారాయణపేట

### ఉపాధి పొందుతున్నా..

ఎమ్మెల్యే చిట్టెం పర్ణికమ్మ, ఎంపీ అరుణమ్మ ఇద్దరూ మా ఊరు ధన్వాడ ఆడపడుచులు. నాకు ఈ రోజు చాలా హ్యాపీగా ఉంది సార్. నా సొంతంగా జొన్న, రాగి రొట్టెల వ్యాపారం చేస్తున్నా. మహిళా సంఘం సభ్యురాలిగా ఉన్నా. నా భర్త 2011లో చనిపోయారు. పిల్లలను పోషించుకునేందుకు ప్రైవేట్ స్కూల్‌లో పనిచేసి రూ.5 వేలు సంపాదించేదానిని. కానీ మహిళా సంఘంలో రుణం పొంది ఈ రోజు నెలకు రూ.30 వేలు సంపాదిస్తున్నా.

– రాజేశ్వరి, మహిళా సంఘం సభ్యురాలు, ధన్వాడ

# నల్లమలలో మార్మోగుతున్న శివనామస్మరణ


భోగమహేశ్వరంలో సేద తీరుతున్న శివస్వాములు

**అచ్చంపేట:** నల్లమల కొండల్లో శివనామస్మరణ మార్మోగుతోంది. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీశైలం క్షేత్రానికి శివస్వాములు, భక్తులు కాలినడకన తరలివెళ్తున్నారు. వనపర్తి–అచ్చంపేట, మహబూబ్‌నగర్– అచ్చంపేట, హైదరాబాద్ – శ్రీశైలం ప్రధాన రహదారులతో పాటు నల్లగొండ, మిర్యాలగూడ తదితర ప్రాంతాల నుంచి శివస్వాములు శ్రీశైలం క్షేత్రానికి కాలినడకన తరలివస్తుండటంతో అభయారణ్యంలో రద్దీ పెరిగింది. అచ్చంపేట–ఉమామహేశ్వరం మీదుగా అటవీ మార్గంలో శివస్వాములు పాదయాత్ర చేస్తున్నారు. మదిలో శివయ్యను తలుస్తూ.. సుదూర ప్రాంతాల నుంచి అలుపెరగని కాలినడక సాగిస్తున్నారు. ఏ చెట్లు, గుట్టలు, కాలిబాటలు చూసిన శివస్వాములే దర్శనమిస్తున్నారు. ఎంతో నిష్టతో 41 రోజులపాటు శివదీక్ష బూని భక్తిపారవశ్యంతో ముందుకు సాగుతున్నారు. నల్లమల అటవీ ప్రాంతంలో ఆధ్యాత్మిక, సామాజిక సేవకులు అన్నదానం, తాగునీటి సదుపాయం కల్పిస్తూ.. శివస్వాములు సేవలు అందిస్తున్నారు. మరికొందరు పండ్లు పంపిణీ చేస్తున్నారు.

- మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీశైలం ఉత్తరద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రంలో శివస్వాములు, భక్తులకు మేఘ కన్‌స్ట్రక్షన్స్ ఆధ్వర్యంలో వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి 21 ఏళ్లుగా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తూ వస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం ఎమ్మెల్యే తన కుటుంబ సభ్యులతో కలిసి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శివస్వాములు, భక్తులకు ప్రతి ఏటా అన్నదాన కార్యక్రమం నిర్వహించడం ఎంతో సంతృప్తి కలిగిస్తుందన్నారు. ఉమామహేశ్వర ఆలయ అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ భీరం మాధవరెడ్డి, పవన్, కృష్ణారెడ్డి, మన్సూర్ పాల్గొన్నారు.


కాలినడకన శ్రీశైలం క్షేత్రానికి తరలివెళ్తున్న స్వాములు


ఉమామహేశ్వరంలో పూజలు చేస్తున్న వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి

# నిలకడగా విద్యార్థుల ఆరోగ్యం


ఎస్వీఎస్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థిని పరామర్శిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

**జడ్చర్ల టౌన్:** మండలంలోని పోలేపల్లి ఎస్ఎంఐఎంఎస్ యూనివర్సిటీలో ఫుడ్ పాయిజన్‌కు గురైన విద్యార్థులు కోలుకుంటున్నారు. అస్వస్థతకు గురైన వారిని బుధవారం ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఆదేశాలతో జిల్లా కేంద్రంలోని ఎస్వీఎస్ ఆస్పత్రికి తరలించిన విషయం తెలిసిందే. అక్కడ చికిత్స అనంతరం ముగ్గురు విద్యార్థులను మినహా మిగిలిన వారందరిని డిశ్చార్జ్ చేశారు. గురువారం మరో విద్యార్థిని అస్వస్థతకు గురికావడంతో చికిత్స నిమిత్తం ఎస్వీఎస్‌కు తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను బీఆర్ఎస్ నాయకులతో కలిసి జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ కోడ్గల్ యాదయ్య పరామర్శించారు. అంతకుముందు యూనివర్సిటీ నిర్వాహకులతో వివరాలను తెలుసుకున్నారు. మరోమారు ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అయితే మహారాష్ట్ర ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన విద్యార్థులకు ఇక్కడి నీళ్ల పడటం లేదని.. అందుకే ఇలా జరిగిందని నిర్వాహకులు తెలియజేశారు.

**విద్యార్థి సంఘాల ఆందోళన..**

ఎస్ఎంఐఎంఎస్ యూనివర్సిటీలో ఫుడ్ పాయిజన్ ఘటనను నిరసిస్తూ ఎస్ఎఫ్ఐ, ఏబీవీపీ నాయకులు వేర్వేరుగా ఆందోళన చేపట్టారు. విద్యార్థుల అస్వస్థతకు కారణమైన ఫుడ్ ఇన్‌చార్జిపై చర్యలు తీసుకోవాలని నినదించారు. అస్వస్థతకు గురైన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు ఇలాంటి ఘటనలు మరోమారు చోటు చేసుకోకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోకుంటే యూనివర్సిటీ అనుమతి రద్దు చేయించాలని స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు.

# రెస్టారెంట్‌లో అగ్నిప్రమాదం

ఐదుగురు సిబ్బందిని రక్షించిన అగ్నిమాపక సిబ్బంది


రక్షించిన హోటల్ సిబ్బందితో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది


రెస్టారెంట్‌లో ఎగిసిపడుతున్న మంటలు

**మహబూబ్‌నగర్ క్రైం:** పట్టణంలోని శ్రీనివాసకాలనీ సమీపంలో ప్రధాన రహదారిపై ఉన్న అరేబియాన్ మండి ఫ్యామిలీ రెస్టారెంట్‌లోని రెండో అంతస్తు ఫ్యామిలీ సెక్షన్‌లో శుక్రవారం సాయంత్రం షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. కుర్చీలకు మంటలు వ్యాపించి దట్టమైన పొగ రావడంతో వెంటనే స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. ఫైరింజన్, అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేయడంతో పాటు ఐదుగురు సిబ్బందిని నిచ్చెన ద్వారా సురక్షితంగా కిందకు దించారు. రెస్టారెంట్ ప్రధాన రహదారిపై ఉండటంతో కాసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ ప్రమాదంపై జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి కిషోర్ మాట్లాడుతూ.. కుర్చీలకు రెగ్జిన్ ఉండటంతో మంటలు త్వరగా వ్యాపించాయని, ఎలాంటి ప్రాణాపాయం జరగలేదని తెలిపారు. ఈ ప్రమాదంతో రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగి ఉంటుందని వెల్లడించారు.

# 'సాగునీరు అడిగితే సాకులు చెబుతున్నారు'

**వనపర్తి:** రైతులు సాగునీరు అడిగితే.. కాంగ్రెస్ నాయకులు సాకులు చెబుతూ కాలయాపన చేస్తున్నారని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో సాగునీటి కేటాయింపుల విషయంలో మొదటి నుంచి తెలంగాణకు అన్యాయమే జరిగిందని.. గత పాలకులు పక్షపాత ధోరణి ప్రదర్శించారని మండిపడ్డారు. మాజీ సీఎం కేసీఆర్ తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోసి గ్రామగ్రామాన తిరిగి ప్రజానీకాన్ని ఏకం చేసి ప్రత్యేక రాష్ట్రాన్ని తీసుకొచ్చారని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రాగానే పెండింగ్ ప్రాజెక్టులు, కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తిచేసి, పాలమూరు–రంగారెడ్డి పనులను చివరి దశకు తీసుకొచ్చినట్లు గుర్తుచేశారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత నది జలాల వాటా తేల్చాలని అప్పటి కేసీఆర్ పలుమార్లు కేంద్రానికి లేఖలు రాసినా పదేళ్లుగా ఉద్దేశ పూర్వకంగా నిర్లక్ష్యం చేశారని తెలిపారు. నది జలాల వాటాను తేల్చని కేంద్రాన్ని ఏమీ అనలేక గత పాలకుల నిర్లక్ష్యం అనడం కాంగ్రెస్ పాలకుల విజ్ఞతకే వదిలేస్తున్నమన్నారు. నది జలాల వాటా తేల్చకపోతే కేంద్రంపై యుద్ధం చేస్తామని రేవంత్‌రెడ్డి అంటున్నారని.. తెలంగాణ ప్రజల తరుపున ప్రతిపక్ష హోదాలో ఉన్న తమ పార్టీ మద్దతు తెలుపుతుందని దీక్షలు, పోరాటాలు చేయడానికి సైతం సిద్ధంగా ఉన్నామని తెలిపారు. సమావేశంలో మాజీ జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ లక్ష్మయ్య, జిల్లా పార్టీ అధ్యక్షుడు గట్టుయాదవ్, నాయకులు వాకిటి శ్రీధర్, కురుమూర్తి యాదవ్, మాణిక్యం, జోహెబ్, రాము తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

### ఖాళీలను భర్తీ చేయాలి

**స్టేషన్ మహబూబ్‌నగర్:** సమస్యల పరిష్కారం కోసం అన్ని బ్యాంకుల ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, సభ్యులు శుక్రవారం జిల్లాకేంద్రంలోని యూనియన్ బ్యాంక్ రీజినల్ కార్యాలయం ఎదుట యూఎఫ్‌బీయూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ప్లకార్డులు పట్టుకొని సమస్యలను పరిష్కరించాలని నినదించారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ బ్యాంకుల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ఐదు రోజుల పనిదినాన్ని ప్రకటించాలని, పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. వచ్చే నెల 24, 25 తేదీల్లో దేశవ్యాప్తంగా బ్యాంకుల సమ్మెకు పిలుపునిచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ తిరుమల్‌రెడ్డి, అధ్యక్షుడు జె.రాజేష్, కెనరా బ్యాంకు ఆఫీసర్స్ అసోసియేషన్ ఎంఆర్.జయకర్, అభిలాష్‌రెడ్డి, శివనరేంద్రనాథ్ పాల్గొన్నారు.

# శ్రీశైల మల్లన్నకు అమరచింత పట్టువస్త్రాలు

- శ్రీశైలంలో కొనసాగుతున్న నేత పనులు
- మహాశివరాత్రికి ఆలయ ఈఓకు అందజేత


శ్రీశైలంలోని పద్మశాలిభవన్‌లో పట్టువస్త్రాలు తయారు చేస్తున్న అమరచింత పద్మశాలి కులస్తులు

**అమరచింత:** మహాశివరాత్రి రోజున శ్రీశైల మల్లికార్జునస్వామి, భ్రమరాంబిక అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించే పనుల్లో అమరచింత పద్మశాలీలు నిమగ్నమయ్యారు. ఇందుకుగాను వారం క్రితమే శ్రీశైలం క్షేత్రంలోని పద్మశాలి భవన్‌లో ప్రత్యేకంగా మగ్గం ఏర్పాటు చేసుకొని నేత పనులు ప్రారంభించారు. మహాశివరాత్రి నాటికి నేత పనులు పూర్తిచేసి ఆలయ ఈఓకు వీటిని భక్తిశ్రద్ధలతో అందించనున్నారు. ఏళ్లుగా వస్తున్న ఆచారాన్ని నేటికీ కొనసాగిస్తున్నామని సంఘం పట్టణ అధ్యక్షుడు మహంకాళి విష్ణు తెలిపారు. నియమ నిష్టలతో స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు తయారు చేస్తున్నామని వివరించారు.

**అందరి భాగస్వామ్యంతో..**

పట్టణంలోని పద్మశాలి కులస్తులందరి భాగస్వామ్యంతోనే పట్టువస్త్రాలు తయారుచేయడం అనాదిగా వస్తోంది. భక్త మార్కండేయస్వామి పద్మశాలీల కులదైవం.. కాబట్టి ఆయన కొలిచే శివయ్యకు తమవంతుగా పట్టువస్త్రాలు అందిస్తున్నామని కులపెద్దలు వివరించారు. గతంలో అమరచింతలో వస్త్రాలు నేసి శ్రీశైలానికి వెళ్లి అందించే వారమని.. ప్రస్తుతం క్షేత్రంలోనే మగ్గం ఏర్పాటు చేసుకొని తయారు చేస్తున్నట్లు తెలిపారు. అమరచింతలోని శివచౌడేశ్వరి ఆలయం నిర్మించిన మహంకాళి గంగ, శ్రీనివాసులు సోదరులు పట్టువస్త్రాల తయారీకి అయ్యే ఖర్చును ఏటా అందిస్తున్నారని చెప్పారు.

### మహాభాగ్యం..



శ్రీశైలంలో ఉంటూ స్వామి, అమ్మవార్ల పట్టువస్త్రాల తయారీలో పాల్గొనడం మహాభాగ్యంగా భావిస్తున్నా. మగ్గంపై వస్త్రాల తయారీకి అవసరమైన దారం కండెలు చుట్టడం, మగ్గం పనులు చేస్తూ తరిస్తున్నా.

– కదుదాసు సిద్ధమ్మ, అమరచింత

### స్వామివారి సేవలో..



పట్టువస్త్రాల తయారీలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నా. నియమ నిష్టలతో ఉపవాస దీక్ష చేపట్టి వస్త్రాలు తయారు చేస్తున్నాం. ఈ అవకాశం దక్కడం ఎంతో ఆనందంగా ఉంది.

– మహంకాళి సత్యనారాయణ, అమరచింత

### ఏటా వెళ్తున్నా..



శ్రీశైల మల్లన్న పట్టువస్త్రాల తయారీ పనులకు ఏటా వెళ్తున్నా. స్వామివారి సేవలో పాల్గొనేందుకు అ వకాశం దక్కడం సంతోషం కలిగిస్తుంది. శక్తి ఉన్నంత వరకు వస్త్రాల తయారీలో పాల్గొంటా.

– లడ్డు శ్రీను, అమరచింత

### నేత పనుల్లో సాయం..



శ్రీశైలంలోని పద్మశాలిభవన్‌లో ప్రత్యేకంగా మగ్గం ఏర్పాటు చేసుకొని పట్టువస్త్రాలు తయారు చేస్తున్న పనుల్లో తనవంతు సాయం చేయడానికి ఏటా వెళ్తున్నా. ఈ ఏడాది కూడా పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నా.

– మహంకాళి ఎల్లప్ప, అమరచింత